క్లుప్తంగా

స్కేటర్ తనూషకు అభినందన



పటమట(విజయవాడతూర్పు): మొహాలిలో ఈ నెల 2న ముగిసిన జాతీయ(అంతర్ రాష్ట్ర) రోలర్ స్పీడ్ స్కేటింగ్ ఈవెంట్‌లో యల్లపు తనూష పతకాల్లో సత్తా చాటగా శనివారం వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిశారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆమె ఛాంబర్‌లో కలిసిన కోచ్ చంటి, తనూష రింక్–3, రింక్–2 పోటీల్లో అండర్ 5–7 ఏజ్ గ్రూప్‌లో స్వర్ణం, కాంస్యం సాధించామన్నారు. ఈ సందర్భంగా వారిని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అభినందించారు. తనూష భవిష్యత్‌లో మరిన్ని పతకాలను సాధించాలని, విజయవాడ నగరానికి మరింత ఖ్యాతి తీసుకురావాలన్నారు.

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఈనెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ తెలిపారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం ఠాగూర్ గ్రంథాలయంలోని ఆమె కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జమల పూర్ణమ్మ మాట్లాడుతూ.. వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి సెలవుల్లో విజ్ఞానం, వినోదం అందించే ఇలాంటి శిబిరాలకు పంపాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, గ్రేడ్ – 3 గ్రంథ పాలకురాలు వై.ధనలక్ష్మి, రికార్డ్ అసిస్టెంట్ కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

110 మందికి వైద్య పరీక్షలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): డీబీఆర్‌సీ, ఎస్‌పీఏఆర్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో 60వ డివిజన్ వాంబేకాలనీలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాస్ జుకూర్ 110 మందికి రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. స్పార్క్ సంస్థ ప్రతినిధులు షర్మిల, డీబీఆర్‌సీ ప్రతినిధులు రమాదేవి, మాధవరావు, ఈశ్వర్, బెంచమెన్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర సలహా మండలి సభ్యురాలిగా కృష్ణకుమారి



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌కు చెందిన చేయూత మానసిక దివ్యాంగుల శిక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణకుమారి విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర సలహా మండలి సభ్యురాలిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌కు చెందిన స్థానిక పెద్దలు, చేయూత మానసిక దివ్యాంగుల శిక్షణ సంస్థ సిబ్బంది కృష్ణకుమారిని శనివారం అభినందించారు. తనపై నమ్మకంతో తనకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తానని, విభిన్న ప్రతిభావంతుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని కృష్ణకుమారి అన్నారు.

టీడీపీ నేతపై చీటింగ్ కేసు

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో టీడీపీ నేతపై పోలీసులు శనివారం చీటింగ్ కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిశోర్ బాబు తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాక శివాలయం సమీపంలో ఉంటున్న కొడాలి నాగలక్ష్మి, నరేంద్ర దంపతులు నివసిస్తున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మునునూరి నిర్మల్‌కుమార్ తన లారీల వ్యాపారం నిమిత్తం 2015లో నాగలక్ష్మి వద్ద వడ్డీకి రూ. 5 లక్షలు అప్పు తీసుకున్నాడు. తీసుకున్న అప్పు తిరిగి చెల్లించమని ఆమె కోరగా సొమ్ము ఇవ్వటంలేదు. పైగా నాగలక్ష్మిని బెదిరించసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులు ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.

జూదరుల అరెస్టు

పెనమలూరు: కోడి పందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి నారాయణపురం కాలనీ సమీపంలో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. వీరి దాడిలో కోనపరెడ్డి పవన్‌కుమార్, కె.కాసులు, ఎస్.శివప్రసాద్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ. 2,100, రెండు పుంజులు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణోత్సవం



స్వామి వారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకులచే సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియం ఆవరణలో నిర్వహించిన శ్రీశ్రీనివాస కల్యాణోత్సవం శనివారం కనులపండువగా జరిగింది. తొలుత ఇందిరానాయక్‌నగర్‌లో ఏర్పాటుచేసిన యాగశాలలో మహా గణపతి హోమం, చండీ హోమం, పూర్ణ హోమాలను చేపట్టారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, శ్రీనివాసరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం యాగశాల నుంచి స్టేడియం ఆవరణ వరకూ ఉత్సవ మూర్తులను అత్యంత వైభవంగా ఊరేగించారు. తిరుమలలో మాదిరిగా టీటీడీ ప్రధాన అర్చకులు శ్రీభూదేవి సమేత తిరుమలేశ్వరునికి వసంతోత్సవం, శ్రీనివాస కళ్యాణ వైభోగాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఏపీఐడీసీ చైర్మన్ బండి పుణ్యశీల, శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్పొరేటర్లు ఇసరపు దేవి, ఎండీ షాహీనా సుల్తానా, అలంపూరు విజయలక్ష్మి, ఉమ్మడి రమాదేవి, నాయకులు బొప్పన భవకుమార్, ఇసరపు రాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

ఎంబీ స్టేడియంలో చేపట్టిన శ్రీనివాసుని కల్యాణోత్సవాల్లో ఉత్సవమూర్తులకు ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా పట్టువస్త్రాలను సమర్పించారు. యాగశాలలో జరిగిన హోమం వద్ద కార్యక్రమ నిర్వాహకులు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, శ్రీనివాసరెడ్డి దంపతులకు ఆయన పట్టు వస్త్రాలను అందజేశారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రులు జోగి రమేష్, కొట్టు సత్యనారాయణ



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చక స్వాములు

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభానికి సిద్ధం



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్‌లో కోటి రూపాయలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభానికి సిద్ధమైంది. గత ప్రభుత్వ హయాంలో 30వ డివిజన్‌లో అంగన్‌వాడీ సెంటర్, ఆరోగ్య కేంద్రం లేకపోవటంతో కనీసం వ్యాక్సిన్‌లు, పల్స్‌పోలియో చుక్కలు వేసేందుకు సైతం సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఆరోగ్య సేవల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. సమస్యను స్థానికులతో కలిసి కార్పొరేటర్ బి.జానారెడ్డి ఎమ్మెల్యే మల్లాది విష్ణు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి నూతనంగా ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయించారు. అలాగే అన్ని వసతులతో వైద్యసేవలు అందించేందుకుగానూ దేవీనగర్‌లో రూ.కోటి వ్యయంతో ఆరోగ్య కేంద్రం నిర్మించేందుకు నిధులను మంజూరు చేసి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వైద్య సేవలకు ఇబ్బంది లేకుండా ప్రస్తుతం అద్దె భవనంలో ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అన్ని వసతులతో నూతన భవన నిర్మాణ పనులు పూర్తిచేశారు. ఆరోగ్య కేంద్రం చుట్టూ ప్రహరీని సైతం నిర్మిస్తున్నారు. సాధ్యమైనంత త్వరలోనే ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తామని అధికారులు తెలిపారు.

దాసాంజనేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, నాగవలీ దళాలతో అర్చన నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

హోటల్ కార్మికుడిపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): హోటల్‌లో కార్మికుడిపై దాడికి పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పంజా సెంటర్‌లో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం పంజా సెంటర్‌లోని ఓ బిర్యానీ హోటల్‌లో రవీంద్ర పని చేస్తుంటాడు. శనివారం మధ్యాహ్నం హోటల్‌కు ఇద్దరు యువకులు వచ్చి బిర్యానీ పార్సిల్ కావాలని అడిగారు. బిర్యానీని రవీంద్ర పార్సిల్ చేసే క్రమంలో యువకులు వాదనకు దిగారు. దీంతో వచ్చిన ఇద్దరు యువకుల్లో ఒకరు రవీంద్రపై దాడి చేసి ముఖంపై కొట్టడంతో కంటికి తీవ్ర గాయమైంది. ఇంతలో దాడిపై హోటల్ యజమాని కొత్తపేట పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకునే సరికి ఇద్దరు యువకులు పరారయ్యారు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఛాంగురే బంగారు రాజా కడుపుబ్బ నవ్విస్తుంది

చిత్ర కథానాయకుడు కార్తీక్ రత్నం



మాట్లాడుతున్న ఛాంగురే బంగారు రాజా హీరో కార్తీక్‌రత్నం, పక్కన హీరోయిన్ నిస్సీ, దర్శకుడు సతీష్ వర్మ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఛాంగురే బంగారు రాజా సినిమా ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తుందని ఆ చిత్రహీరో కార్తీక్‌రత్నం అన్నారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా శనివారం విజయవాడ నగరానికి విచ్చేసిన చిత్ర బృందం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్ రత్నం మాట్లాడుతూ ప్రముఖ హీరో రవితేజ చాంగురే బంగారు రాజా చిత్రాన్ని నిర్మించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రముఖ కమెడియన్ హీరో సునీల్ తమ చిత్రానికి వాయిస్ ఓవర్ ఇచ్చారని, ఆయన వాయిస్‌తో వచ్చిన ట్రైలర్‌కి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈ చిత్రంలోని సన్నివేశాలను దర్శకుడు చాలా చక్కగా తీశారని, ప్రేమకులను కచ్చితంగా ఆకట్టుకునే విధంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరోయిన్ నిస్సీ మాట్లాడుతూ నా తొలి చిత్రానికి హీరో రవితేజ నిర్మాతగా వ్యవహరించడం సంతోషంగా ఉందన్నారు. తనకు, హీరోకు మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తాయన్నారు. దర్శకుడు సతీష్‌వర్మ మాట్లాడుతూ ఈ వేసవిలోనే సినిమా రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. చిన్న చిత్రమైనా ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుందన్నారు. ఈ సమావేశంలో నిత్య, జోష్ రవి, పుష్ప రవి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కంకిపాడు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కంకిపాడు పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కె. సుధాకర్ తెలిపిన కథనం మేరకు ఈడుపుగల్లు నుంచి ఉప్పులూరులోని ఒక ఇంటికి రేషన్ బియ్యం తరలించనట్లు సమాచారం అందటంతో ఆ ఇంటి పై పోలీసులు దాడులు నిర్వహించి రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 1,150 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోని ఇందుకు పాల్పడిన లాం ప్రవీణ్‌పై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ పనుల పరిశీలన



అంబేడ్కర్ విగ్రహ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బొమ్ములూరులోని సాయి శిల్పా కేంద్రంలో రూపుదిద్దుకుంటున్న అంబేడ్కర్ కాంస్య విగ్రహం పనులను విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. విజయవాడలోని స్వరాజ్యమైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంబేడ్కర్ స్మృతివనంలో ఏర్పాటు చేయనున్న 125 అడుగుల ఎత్తయిన అంబేడ్కర్ కాంస్య విగ్రహంలో ముఖ్య భాగాన్ని ఢిల్లీలో తయారు చేస్తుండగా, మరికొంత భాగాన్ని గత నాలుగు నెలలుగా బొమ్ములూరులోని సాయి శిల్పా కేంద్రంలో తయారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అంబేడ్కర్ కాంస్య విగ్రహ తయారీ పనుల నాణ్యతను శనివారం పరిశీలించారు. విగ్రహ తయారీలో కచ్చితంగా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, ఏ విధమైన పొరపాట్లు దొర్లకుండా పనులు చేయాలని ఆయన శిల్పులను ఆదేశించారు.

జనసేన నాయకుల వ్యాఖ్యలు సిగ్గుచేటు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): బీసీల మనోభావాలు దెబ్బతీసేలా జనసేన నాయకులు మాట్లాడటం సిగ్గుచేటని దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. జనసేన నాయకుడు పోతిన మహేష్ తనపై చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. బ్రాహ్మణ వీధిలోని దేవస్థాన బోర్డు మీటింగ్ హాల్‌లో శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. పోతిన మహేష్‌తో పాటు అతని సోదరుడిపై 420 చీటింగ్ కేసులు ఉన్నాయని, అటువంటి వ్యక్తి తనను రౌడీషీటర్, 420 కేసులు ఉన్నాయని వ్యాఖ్యానించడం బాధకరమన్నారు. దీనిపై ఆధారాలు చూపాలని, లేని పక్షంలో రెండు రోజుల్లో అతనిపై చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతానని చెప్పారు. దుర్గ గుడి అధికారులను బ్లాక్ మెయిల్ చేసి పనులు చేయించుకోవడం, దుర్గా ఘాట్‌లో డబ్బులు వసూలకు పాల్పడుతున్న వారు ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

రైతులపై చంద్రబాబు మొసలి కన్నీరు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రైతులపై చంద్రబాబు మొసలి కన్నీరు కారుస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు ఆకుల శ్రీనివాస్ కుమార్ ఒక ప్రకటనలో విమర్శించారు. అమరావతి ఆర్–5 జోన్‌కు సంబంధించి హైకోర్ట్ ఇచ్చిన తీర్పుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

సత్తా చాటిన టెన్త్ విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నగరపాలకసంస్థ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వటంతో పాటు ఎప్పటికప్పుడు పర్యవేక్షించటం అవసరమైన సదుపాయాలను కల్పించటం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యార్థులు మార్కులు సాధించారు.

73 శాతం ఉత్తీర్ణత

ముత్యాలంపాడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు నగరపాలకసంస్థ పాఠశాలలలో మొత్తం 49 మంది పరీక్షలకు హాజరుకాగా 36 మంది ఉత్తీర్ణత(73 శాతం) సాధించారు. గతేడాది 50 శాతం ఉత్తీర్ణత సాధించగా ఇప్పుడు ఉత్తీర్ణత శాతం 73కు పెరిగింది. పాఠశాలకు చెందిన బి.చాణిక్య, కె.లక్ష్మీపుర్వాణి, బి.రాఘవి, రాచూరి వలివ ఉత్తమ మార్కులు సాధించారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.పుష్పలత, ఉపాధ్యాయులు అభినందించారు. ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి వారు కూడా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తామని హెచ్‌ఎం తెలిపారు.

ఎస్‌టీవీఆర్ పాఠశాలలో..

దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలో మొత్తం 125 మంది పరీక్షకు హాజరుకాగా 72 మంది ఉత్తీర్ణత(58 శాతం) సాధించారు. గతేడాది ఇక్కడ ఉత్తీర్ణత శాతం 37 ఉండగా ఇప్పుడు 58 శాతానికి పెరిగింది. పాఠశాలకు చెందిన ఏ.పూర్ణిమ, ఆర్.రాకేష్, ఎస్‌కే మహెమూద అత్యుత్తమ మార్కులు సాధించారు. విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

వీఎంసీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పాఠశాలలో చదువుతున్న పలువురు పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. నగరంలోని 29 పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో మొత్తం 2,345 మంది విద్యార్థులు హాజరవ్వగా వారిలో 1,477 మంది విద్యార్థులు (63శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. తెలుగు మీడియంలో 70 శాతం ఉత్తీర్ణతతో 233 మందికి 177 మంది విద్యార్థులు, ఉర్దూ మీడియంలో 63 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా 56 మంది ఉత్తీర్ణత సాధించి 88 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. వించిపేటలోని ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాల లో 23 మంది విద్యార్థులకు గాను 21 మంది ఉత్తీర్ణత సాధించి 91 శాతం ఉత్తీర్ణత సాధించి నగరంలో మొదటి స్థానంలో సాధించింది.

90 శాతంతో ఉత్తీర్ణత

ఇస్లాంపేటలోని మమూ ఉర్దూ హైస్కూల్‌లో 90 శాతంతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో రాజీవనగర్ ఆర్‌జీఎంసీ హెచ్ స్కూల్‌లో 82 శాతం, పటమటలోని జీడీఈఎంసీహెచ్‌లో 81 శాతం, కృష్ణలంకలోని వీఎమ్మార్ బాలిక ఉన్నత పాఠశాలలో 79 శాతం, భవానీపురంలోని ఎస్ఎంఏకె స్కూల్‌లో 78 శాతం ఉత్తీర్ణత సాధించారు. సత్యనారాయణపురం లోని ఏకేటీపీఎం పాఠశాలలో నందెపు జోయెల్ సుమన్, పటమటలోని జీడీఈటీ విద్యార్థి జేమమ్ డెబోరా, కండ్రికలోని ఎస్‌బీవీఎస్ఆర్ స్కూల్ విద్యార్థి ఓ.ప్రణీత సాయి, పటమటలోని జీడీఈటీ విద్యార్థి శ్యామ్ ఉత్తమ మార్కులు సాధించారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవాలని మేయర్ ఆకాంక్షించారు.

ఏకేటీపీ విద్యార్థుల ప్రతిభ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని ఏకేటీపీ మున్సిపల్ హైస్కూల్‌లో పది ఫలితాల్లో విజయ కేతనం ఎగురవేశారు. మొత్తం 315 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందులో 189 మంది ఉత్తీర్ణత సాధించారు. గతేడాది ఉత్తీర్ణత 32 శాతం ఉండగా ఈ ఏడాది 60 శాతానికి పెరిగినట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు పేర్కొన్నారు. నందేపు జోయేల్ సుమన్, కారాల గగన్‌సాయి, కలకాల సాయి నాగేంద్ర ఉత్తమ మార్కులు సాధించడంతో పాటు 500 మార్కులకు పైగా 32 మంది, ద్వితీయ స్థానంలో 51 మంది ఉత్తీర్ణులయ్యారు.

సీఎం జగన్ సంస్కరణల ఫలితమే...

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన సంస్కరణల ఫలితమే ఏకేటీపీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు సాధించిన ఫలితాలు అని స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తి పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించి అభినందనలు తెలిపారు.

అనంతరం మాట్లాడుతూ.. ఉత్తమ ఫలితాలు సాధించడంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని కొనియాడారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహకారంతో పాఠశాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పాఠశాల టాపర్‌గా నిలిచిన ముగ్గురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించి నగదు బహుమతులను అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ప్రకాష్, నాయకులు నాదెండ్ల శంకర్ పాల్గొన్నారు.

పది ఫలితాల్లో 'శ్రీ చైతన్య' విజయభేరి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని విజయవాడ శ్రీచైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ మద్దినేని మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ జోన్ పరిధిలోని తమ విద్యాసంస్థల నుంచి ఈ ఏడాది మొత్తం 3,300 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 98 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. శనివారం విడుదలైన ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ మంచి మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మురళీకృష్ణ అభినందించారు.

ఉబ్బసం వ్యాధిపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ హరీష్, పక్కన వైద్యులు సమరం, మారు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉబ్బసం వ్యాధిపై ప్రజలకు అవగాహన అవసరమని ఫిజీషియన్ డాక్టర్ కె.హరీష్ తెలిపారు. బెంజిసర్కిల్ సమీపంలోని వాసవ్య నర్సింగ్ హోమ్‌లో శనివారం ఉబ్బసం వ్యాధిపై ఆరోగ్య సదస్సు జరిగింది. ఈ సదస్సులో డాక్టర్ హరీష్ మాట్లాడుతూ.. ఉబ్బసం ఏ వయస్సు వారికైనా రావచ్చునని, దానికి ప్రధాన కారణం ఎలర్జీ అని చెప్పారు. దుమ్ముధూళి, పూల పుప్పొడి, పెంపుడు జంతువుల వెంట్రుకలు ఉబ్బసానికి కారణాలన్నారు. చల్లగాలి, కొన్ని ఆహార పదార్థాలు, మానసిక వత్తిడి, కొన్ని రకాల మందులు, ధూమపానం, రకరకాల ఇన్ఫెక్షన్లు, వ్యాయామం కూడా ఉబ్బసం తత్వం ఉన్న వాళ్లకి దానిని ప్రకోపించేటట్లు చేస్తాయన్నారు. వ్యాధి రావడానికి కారణాలను గుర్తిస్తే చాలా వరకూ అదుపులో ఉంచుకోవచ్చని చెప్పారు. ఉబ్బసం వచ్చిన వారిలో ప్రధానంగా ఆయాసం, పిల్లికూతలు ఉంటాయన్నారు. అలాగే ఛాతిలో నొప్పి, నిద్రపట్టక పోవడం, తలనొప్పి, అలసట, దగ్గు, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఉబ్బసాన్ని స్పైరోమీటర్ టెస్టు ద్వారా నిర్ధారణ చేసుకోవచ్చునని తెలిపారు. సదస్సుకు డాక్టర్ సమరం అధ్యక్షత వహించగా, డాక్టర్ మారు పాల్గొన్నారు.

అలరించిన 'భక్తిగాన సుధ'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కొప్పరపు బలరామకృష్ణ మూర్తి, జయరాం, సుధాకర్, గాయకులు

విజయవాడ కల్చరల్: గుడిపాటి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాళ్ళపాక అన్నమాచార్యుని జయంతి సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో నిర్వహించిన భక్తిగాన సుధ కార్యక్రమం స్వరరాయ యుక్తంగా సాగింది. గుడిపాటి జయరాం సుధాకర్ ఆధ్వర్యంలో కొప్పరపు ఉమాబలరాం, మల్లాది స్వాతి, అయ్యప్పన్, శ్రీనిధి, సింధూ భక్తి గీతాలతో పాటు అన్నమయ్య రచించి స్వరపరచిన సంకీర్తనలను మధురంగా ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి జ్యోతిని వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. అన్నమయ్య సంకీర్తనలు తెలుగు భాషా వీచికలుగా అభివర్ణించారు. ఆ బాలగోపాలం అన్నమయ్య సంకీర్తనలను మధురంగా పాడుకుంటారన్నారు. 600 ఏళ్ల క్రితం రాసిన కీర్తనలను నేటికి ఆలపిస్తున్నామని చెప్పారు. ఆయన కీర్తనల్లో భక్తి భావంతో పాటు సామాజిక అంశాల ప్రస్తావన కనిపిస్తుందన్నారు. జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, వ్యాపారవేత్త గుడిపాటి దత్తు పాల్గొన్నారు. గాయని వద్దాది కామేశ్వరి నిర్వహించారు.

• వీకెండ్ జోష్ @ ఫుడ్ ఫెస్టివల్







పున్నమి ఘాట్ వద్ద వీఎంసీ రివర్ ఫ్రంట్ ఫుడ్ ఫెస్టివల్‌లో వీకెండ్ జోష్ నెలకొంది. నగర వాసులు భారీగా తరలివచ్చారు. డాగ్ షో, మైమ్ షోలతో పాటు చిన్నారుల ఫ్యాషన్ షో అలరించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ